శుక్రవారం ఎర్రవల్లిలో జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్‌రెడ్డి, గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంతు షిండే, జడ్పీ చైర్మన్ వసంత సురేశ్, పెద్దపల్లి నాయకురాలు ఉష

దొంగలల్ల కలిసేటోళ్ల గురించి బాధలేదు

మొదటిపేజీ తరువాయి...

ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్‌రెడ్డి, జాజాల సురేందర్, గంప గోవర్ధన్, హన్మకొండ షిండే, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ వసంత సురేశ్, పెద్దపల్లి నేత ఉష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తన వృత్తిని కొనసాగిస్తూనే ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని, వారి మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తాత్కాలిక ఒడిదొడుకులు, ఎన్నికల ఫలితాలు పార్టీకి కొత్తకాదని చెప్పారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానంలో చేరుకోవాల్సిన మైలురాళ్లు ఇంకా చాలా మిగిలే ఉన్నాయని తెలిపారు. 'తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, కలలను నెరవేర్చగలిగే అవగాహన మనకు మాత్రమే ఉన్నది' అని చెప్పారు. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకుంటూ సమస్యల లోతును పట్టుకోగలిగి పరిష్కరించగలిగే సత్తా ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉన్నదని పేర్కొననారు. 'నాడు మనం ఉద్యమంలో దిగినప్పుడు మనతో ఎవరున్నారు? ఆనాడైనా, ఈనాడైనా నాయకులను తయారు చేసుకునేది పార్టీనే' అని స్పష్టం చేశారు. 'మొన్న జగిత్యాల నుంచి ఒకాయన పోయి దొంగలల్ల కలిసిండు. బాధ పడేదేమీలేదు. ఆయనను తయారుచేసింది పార్టీనే. అంతకన్నా మెరుగైన నాయకత్వాన్ని పార్టీ తయారుచేసుకుంటది' అని స్పష్టం చేశారు.

సెల్ఫీలకు పోటీపడుతున్న శ్రేణులు

అధినేత కేసీఆర్‌తో ఫొటోలు దిగేందుకు పార్టీ శ్రేణులు పోటీపడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్‌తో ఫొటో తీసుకునేందుకు దాదాపు రెండు గంటల సమయం పడుతున్నది. నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణుల యోగక్షేమాలను కేసీఆర్ ఆరా తీస్తుండడంతో నాయకులు సంబురపడుతున్నారు. జై కేసీఆర్... జై తెలంగాణ నినాదాలతో ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రం మారుమోగిపోతున్నది.

నెరవేరాల్సింది ఎంతో ఉంది

'మనం రెట్టించిన ఉత్సాహంతో ప్రజలకోసం ఇంకా బాగా పనిచేయాల్సి ఉంది' అని పార్టీ శ్రేణులకు కేసీఆర్ పిలుపునిచ్చారు. ప్రజలు అవకాశమివ్వడంతో గత పదేండ్లు చిత్తశుద్ధితో, రాజీపడకుండా ఉద్యమ ఆకాంక్షల సాధన దిశగా అడుగులు వేశామని గుర్తుచేశారు. ఈ ప్రయాణంలో ప్రజల మన్ననలు కూడా పొందామని పేర్కొన్నారు. 'కుల మతాలకు అతీతంగా పని చేస్తూ వ్యవసాయం, సాగునీరు, విద్యుత్తు వంటి అనేక మౌలిక వ్యవస్థలను మెరుగుపరుస్తూ అనేక ప్రజా సమస్యలకు పరిష్కారం చూపినం. కుల వృత్తులను బాగుచేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసినం' అని వివరించారు. ప్రజాస్వామ్యంలో కొన్నిసార్లు అబద్ధపు ప్రచారాలను నమ్మి ప్రజలు బోల్తాపడుతుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి ఎన్నికల్లో జరిగింది అదేనన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడొద్దని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. 'అధికారం ఉంటేనే పనిచేస్తామనే పద్ధతికాదు. మనం ఏ హోదాలో ఉన్నా ప్రజలకోసం పని చేయాల్సిందే. అంతిమ లక్ష్యం తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి మాత్రమే' అని వివరించారు. తెలంగాణలో ఇంకా నెరవేరాల్సిన ప్రజల కలలను మనం మాత్రమే నిజం చేయగలమని కేసీఆర్ పేర్కొన్నారు.

కేసీఆర్ ఆత్మీయ సమావేశాలకు 3 రోజుల బ్రేక్

పదిహేను రోజులుగా అధినేత కేసీఆర్‌తో వరుసగా కొనసాగుతున్న ఆత్మీయ సమావేశాలకు మూడు రోజులపాటు విరామం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. ఎన్నికల అనంతరం ఇప్పటికే పలు దఫాలుగా ముందస్తు సమాచారంతో పార్టీ కార్యకర్తలు, నేతలు అధినేతను కలుస్తున్నారు. తనను కలిసేందుకు ఎర్రవెల్లికి వస్తున్న ప్రజలతో గంటల తరబడి నిలబడి పేరుపేరునా పలకరించి కేసీఆర్ వారి యోగక్షేమాలు ఆరా తీస్తున్నారు. కేసీఆర్ పార్టీ భవిష్యత్తు కార్యాచరణ వంటి అంశాలపై వివిధ వర్గాలతో చర్చించే అవకాశం ఉండడంతో మూడు రోజులపాటు ఆత్మీయ సమావేశాలకు విరామం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. సమావేశాలు మళ్లీ ఎప్పటి నుంచి నిర్వహించేది, ఏయే నియోజకవర్గాల నుంచి పార్టీ నేతలు రావాలన్న విషయమై త్వరలోనే వెల్లడిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

నిజామాబాద్ నేతలతో కేసీఆర్ ప్రత్యేక భేటీ

ఉమ్మడి నిజామాబాద్ నేతలతో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. శుక్రవారం తన వ్యవసాయ క్షేత్రంలో మాజీమంత్రితో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జీవన్‌రెడ్డి, జాజాల సురేందర్, హన్మకొండ షిండే సమావేశమయ్యారు. జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. పార్టీ బలోపేతం కోసం అనుసరించాల్సిన వ్యూహంపై ఇతర ముఖ్యనేతలతో త్వరలో సమావేశం నిర్వహిస్తామని ఈ సందర్భంగా కేసీఆర్ పేర్కొన్నట్టు సమాచారం.

నీట్ రద్దుపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- తమిళనాడు అసెంబ్లీ నిర్ణయం హర్షణీయం
- ముఖ్యమంత్రి రేవంత్ పట్టించుకోకపోవడం సిగ్గుచేటు
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): నీట్ పరీక్షను రద్దు చేయాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీ సమావేశాలను నిర్వహించి నీట్ రద్దు కోసం ఏకగ్రీవ తీర్మాణాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. నీట్ అవకతవకలపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. నీట్‌ను రద్దు చేయాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం దేశానికే ఆదర్శనీయంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ పరీక్షపై ఇంత రాద్ధాంతం జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి తనకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. మెడికల్ కాలేజీల్లో ఇతర రాష్ట్రాల విద్యార్థులను చేర్చుకోకుండా రాష్ట్రానికి మినహాయింపును ఇవ్వాలని, గతంలో మాదిరిగా ఎంసెట్ ఆధారంగానే మెడికల్ అడ్మిషన్లు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతి ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని ఆయన కోరారు. రాష్ట్రాల విన్నపాలను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పడితే సుప్రీంను ఆశ్రయించి, రాష్ట్రాలు తమ హక్కులను సాధించుకోవాలని వినోద్‌కుమార్ సూచించారు.

పీవీకి టీఎన్జీవో, టీజీవో సంఘాల నివాళి

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా శుక్రవారం పలువురు నివాళులర్పించారు. ఢిల్లీలో ఉన్న టీఎన్జీవో, టీజీవో సంఘాల నేతలు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు తదితరులు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దార్శనికుడు పీవీ: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): నాటి ప్రపంచ ఆర్థిక విధానాలకు అనుగుణంగా సంస్కరణలు చేపట్టి దేశ ఆర్థికస్థితిని చక్కదిద్దిన దార్శనికుడు, భరత జాతి ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొనియాడారు. భారత మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు దేశానికి అందించిన సేవలను ఆయన స్మరించుకున్నారు. శుక్రవారం పీవీ జయంతి సందర్భంగా దేశానికి ఆయా రంగాల్లో పీసీ చేసిన కేసీఆర్ సేవలను గుర్తుచేశారు. తెలంగాణ బిడ్డగా మనందరం గర్వపడాలని, పీవీ అందించిన స్ఫూర్తి మరువలేనిదని తెలిపారు.

30 కోట్ల ధాన్యం మాయం

విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి..

కేసముద్రం, జూన్ 28 : రైస్ మిల్లుల్లో రూ.30 కోట్ల విలువైన ధాన్యం మాయమైంది. సివిల్ సప్లయిస్, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలోని 3 రైస్ మిల్లుల్లోనే ఈ ధాన్యం మాయం కావడం సంచలనం సృష్టించింది. మణికంఠ రైస్ మిల్లులో 12, 360 క్వింటాళ్లు, మారుతి రైస్ మిల్లులో 43,464 క్వింటాళ్లు, మహాదేవ రైస్ మిల్లులో 58,070 క్వింటాళ్ల ధాన్యం మాయం కాగా దీని విలువ సుమారు 30 కోట్లు ఉంటుందని, యజమానులపై కేసు నమోదు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

రుణమాఫీ అర్హులను ప్రకటించాలి

'రైతు భరోసా' ఎప్పుడిస్తరో చెప్పాలి • మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రుణమాఫీ అర్హులను వెంటనే ప్రకటించాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ రుణమాఫీపై వెంటనే విధివిధానాలు ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో గత పదేండ్లు కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయం పండుగలా మారితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దండుగులా మార్చిందని మండిపడ్డారు. రైతుభరోసా డబ్బులు ఎప్పుడిస్తరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు పెట్టకుండా వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. ఇప్పటికే పంటల సాగు మొదలైందని, సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ సబ్ కమిటీ వేసి జూలై 15 లోగా నివేదిక ఇవ్వాలని చెప్పారని, అంటే అప్పటివరకు రైతు భరోసా ఇవ్వరా అని ప్రశ్నించారు. రైతుకు సాగులో ఆసరాగా ఉండేందుకు కేసీఆర్ ఈ పథకం ప్రవేశపట్టారని, కాంగ్రెస్ ప్రభుత్వం నాట్లు పూర్తయినా పెట్టుబడి సాయం అందించేలా లేదని మండిపడ్డారు. ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు సాయం ఎప్పుడు ఇస్తారో చెప్పాలని నిలదీశారు. వర్షాలు ఆలస్యమయ్యాయని, సాగునీటి కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని కోరారు. పండిన పంటకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఆచరణలో విఫలమయ్యారని మండిపడ్డారు. విత్తనాలకూ రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని, చివరకు సీఎం నియోజకవర్గంలోనే నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని విమర్శించారు.



తెలంగాణ భవన్‌లో పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీ వాణీదేవి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, దేవీప్రసాద్, బొల్లం

దేశమున్నంత వరకు యాదిలో పీవీ

తెలంగాణ భవన్‌లో ఘనంగా పీవీ జయంతి • బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరును దేశం ఉన్నన్ని రోజులు ప్రజలు ఆయన పేరును గుర్తుంచుకుంటారని బీఆర్ఎస్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో పీవీ జయంతి వేడుకల్లో పాల్గొని నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బహుభాషా ప్రజ్ఞాపాటవంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన గొప్ప మేధావి పీవీ అని కొనియాడారు. కవిగా, కథకుడి గా, మేధావిగా, సంస్కరణశీలిగా పీవీ చరిత్రను దేశం ఎన్నడూ మర్చిపోదని తెలిపారు. పీవీకి ముందు, తర్వాత అన్నతీరుగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చారని శ్లాఘించారు. ఒక ఆర్థికవేత్తను ఆర్థికమంత్రిగా నియమించుకొని అద్భుతంగా ఆర్థిక సంస్కరణలను చేపట్టారని గుర్తుచేశారు. 16 భాషల్లో భాషాప్రావీణ్యం ఉన్నా కొన్నిసార్లు, మౌనమే భాషగా గొప్పపాలన నిర్వహించారని వెల్లడించారు. దేశంలో నవోదయ పాఠశాలలు, గురుకులాలు పెట్టి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారని వివరించారు. 80 ఏండ్ల వయసులో కంప్యూటర్ విద్య నేర్చుకున్న ఆయన.. మనందరికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ఎమ్మెల్సీ సురభి వాణీదేవి మాట్లాడుతూ సమస్యల వలయంలో ఉన్న దేశాన్ని అద్భుతమైన రాజకీయ నాయకుడిగా పీవీ చక్కదిద్దారని చెప్పారు. ఇలాంటి మహానుభావుడిని సమాజం మర్చిపోతుంది అనుకుంటున్న తరుణంలో పీవీ శతజయంతి ఉత్సవాలను కేసీఆర్ ఘనంగా నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీమంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భిక్షమయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు దేవీప్రసాద్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రాకేశ్‌కుమార్, పల్లె రవి, వాసుదేవరెడ్డి, కార్పొరేటర్ కవితారెడ్డి పాల్గొన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో పీవీ చిత్రపటానికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, లెజిస్లేచర్ సెక్రటరీ నరసింహాచార్యులు పూలమాల వేసి నివాళులర్పించారు.

పీవీ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలి

ప్రభుత్వానికి కొణతం దిలీప్ వినతి

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు చెందిన పూర్తి సమాచారం ఉన్న http://pvnr.telangana.gov.in వెబ్‌సైట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ డిమాండ్ చేశారు. ఆ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య ఉంటే సరిదిద్ది, వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వానికి, ముఖ్యంగా ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆయన శుక్రవారం ఎక్స్‌లో విజ్ఞప్తి చేశారు.

ఇది ప్రజాపాలనా? తుగ్లక్ పాలనా?

- ఏది అడిగినా తెలియదంటున్నరు
- నిలదీస్తే కేసులు పెడుతున్నరు
- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులను ఏదీ అడిగినా 'మాకు తెలియదు.. సంబంధం లేదు' అంటున్నరు.. ఇది ప్రజాపాలనా లేదా తుగ్లక్ పాలనా? అని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. కాంగ్రెస్ మంత్రులు డమ్మీలుగా ఉన్నారా? అని నిలదీశారు. అధికారులు విషయాలను మంత్రులకు చెప్పడం లేదా? లేక తప్పించుకోవడానికి మంత్రులే సాకులు చెప్తున్నారా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్‌లో నకిలీ బీర్లు తయారుచేసిన సోం డిస్టిలరీస్‌కి అనుమతులు ఇచ్చిన విషయం తనకు తెలియదని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారని గుర్తుచేశారు. కోట్ల విలువైన ఆర్టీసీ టికెటింగ్ కాంట్రాక్ట్‌కు ఒక కంపెనీకి కట్టబెట్టారన్న విషయం గురించి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అడితే సమాచారం లేదంటున్నారని మండిపడ్డారు. సమాచార హక్కు చట్టం కింద అడిగితే ఇది తమ పరిధిలో లేదని ఆర్టీసీ ఎండీ కార్యాలయం ప్రత్యుత్తరం పంపిందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన లేఖను ఆయన మీడియాకు చూపించారు. ఈ పరిణామాలను చూస్తుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తలేదు... ఫేక్ పాలన నడుస్తున్నట్టు కనిస్తున్నదని ఎద్దేవాచేశారు. సీఎం, మంత్రుల్లో నూ ఏ ఒక్కరికీ జవాబుదారీతనం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని క్రిశాంక్ మండిపడ్డారు. ఆర్టీసీ లోగో విషయంలో కొణతం దిలీప్‌పై, సోషల్ మీడియాలో పోస్టుల అంశంలో తనపై కూడా కేసులు నమోదు చేశారని గుర్తుచేశారు.



భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు సమీపంలో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు వద్ద మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఉద్యమకారుడు దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ శ్రేణులు

'సీతారామ' ఘనత కేసీఆర్‌దే

- బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని తమ గొప్పగా చెప్తున్న మంత్రులు
- ఖమ్మం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం, జూన్ 28 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిర్మించిన సీతారామ ప్రాజెక్టుకు బీఆర్ఎస్ ప్రభుత్వమే నిధులు వెచ్చించి పనులు పూర్తిచేసిందని, ఆ ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ చెప్పారు. జిల్లా మంత్రులు మాత్రం ఆ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్మించినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. శుక్రవారం ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయం(తెలంగాణభవన్)లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 6నెలలైనా కాకముందే ఆప్రాజెక్టును ఎలా పూర్తిచేశారని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఖమ్మం జిల్లాలో ఒక్క ప్రాజెక్టునైనా నిర్మించిందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఖమ్మం జిల్లాలో కేవలం తొమ్మిది నెలల్లోనే 'భక్తరామదాసు' ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి పాలేరు నియోజకవర్గంలోని 72 వేల ఎకరాలకు సాగునీరు అందించిన విషయాన్ని జిల్లా రైతులు ఎప్పటికీ మర్చిపోరని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో కోట్ల రూపాయలను కేటాయించి 'సీతారామ'కు 2017లో శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో 1000 కోట్ల అవినీతి జరిగిందని చెప్పిన మంత్రులు.. ఈ రోజు ప్రాజెక్టు ట్రయల్ రన్ ముందు గొప్పలు చెప్తున్నారని దుయ్యబట్టారు.

ఖమ్మంలోని బీఆర్ఎస్ ఆఫీస్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్

లోకం పోకడ

ఆ మూలకు ఎలాగోలా కన్నంవేసి లీకయిపోదాం!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.3°c	23.2°c
మెదక్	34.9°c	22.3°c
రంగారెడ్డి	34.3°c	21.9°c
నిజామాబాద్	33.9°c	24.1°c
మహబూబ్‌నగర్	32.0°c	23.5°c
హైదరాబాద్	30.8°c	23.5°c
ఖమ్మం	30.0°c	26.0°c
నల్లగొండ	30.0°c	23.0°c
వరంగల్	28.0°c	25.0°c
కరీంనగర్	28.0°c	26.0°c

5 నుంచి భారీ వర్షాలు

బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన ఆవర్తన ప్రభావంతో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసినట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. అల్పపీడన ప్రభావం కోస్తాంధ్ర, ఒడిశా, తెలంగాణ ఉత్తర జిల్లాలపై ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారిణి డాక్టర్ శ్రావణి తెలిపారు. జూలై 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వివరించారు. గురువారం వరకు లోటువర్షపాతం ఉన్న జిల్లాల్లో కూడా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మెరుగైనట్టు చెప్పారు. కుమ్రం భీం జిల్లా వాంకిడిలో శుక్రవారం రాష్ట్రంలోనే అత్యధికంగా 9.05 సెం.మీ వర్షపాతం కురిసింది. శనివారం కూడా పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో వాగులు వంకలు ఉప్పొంగుతున్నాయి. అందవెల్లి సమీపంలోని పెద్దవాగు వద్ద బర్రెలు, ఆవులు వాగు దాటుతున్న సమయంలో వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. మూడు కిలోమీటర్ల తర్వాత పశువులు సురక్షితంగా బయటపడ్డాయి. కాగజ్‌నగర్‌లో అందవెల్లి పెద్దవాగుపై నిర్మించిన అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో కాగజ్‌నగర్, దహెగాం మండలాల మధ్య 42 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

వాగులో కొట్టుకుపోతున్న పశువులు

పెద్దవాగులో కొట్టుకుపోయిన పశువులు

ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరిన మూగజీవాలు

కాగజ్‌నగర్, జూన్ 28: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగులో శుక్రవారం పశువులు కొట్టుకుపోయాయి. తిరిగి ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరాయి. అందవెల్లికి చెందిన పశువుల కాపరి కేశవేణి మల్లేశ్ 30కి పైగా మూగజీవాలను మేపేందుకు అడవికి బయలుదేరాడు. పెద్దవాగు దాటించి జగన్నాథ్‌పూర్ వైపు తోలుకెళ్తుండగా ఒక్కసారిగా వాగు వరద ఉధృతి పెరిగింది. దీంతో పశువులు సుమారు 100 అడుగుల దూరం దాకా కొట్టుకుపోయాయి. వరదలో ఈదుకుంటూ పెద్దవాగు బ్రిడ్జి పిల్లర్లు, ఇసుకమేటల సాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేరాయి. దీంతో పశువుల కాపరితోపాటు వాటి యాజమానులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రాజెక్టు నీటిని వదిలారా? లేదా అనేది తహసీల్దార్‌తోపాటు పోలీసు అధికారులు స్పష్టం చేయలేకపోతున్నారు. ప్రాజెక్టు నీటిని వదిలితే తమకు సమాచారం ఉంటుందని యజమానులు చెప్తున్నారు. ఇటీవలే ఈవాగు అప్రోచ్ రోడ్డు పూర్తిచేసి రాకపోకలు ప్రారంభించారు. ఆ వంతెన పైనుంచి భారీ వాహనాలు వెళ్లకుండా పోలీసులు పహారా కాస్తున్నారు.